

అభయతారకం


విద్యావ్యవస్థలో ప్రభుత్వం మార్పులు ప్రవేశ పెట్టింది. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశించే సమయంలో ఇబ్బంది రాకుండా ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టింది. - 8లో▸



మూడు టన్నుల చేపలు మృతి

చేపల చెరువులో మూడు టన్నుల వరకు చేపలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో సోమవారం చోటు చేసుకుంది. - 8లో▸

10,257 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 10,257 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులకు చేరింది. తాగునీటి అవసరాల కోసం పశ్చిమ డెల్టా కాలువకు 500 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

చెదురుమదురుగా వర్షం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సరాసరి 3.0 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. గోపాలపురంలో 17.0, కోరుకొండలో 13.8, తాళ్లపూడిలో 4.6, సీతానగరంలో 9.6, గోకవరంలో 3.8 మి.మీటర్లు చొప్పున వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో వర్షం జాడ లేదు. బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల అవర్తమానంతో ఆకాశం మేఘావృతమై ఉంది.

స్పందనకు 141 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ తేజ్‌భరత్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ వర్గాల నుంచి 141 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, అధికారులు పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా 1902 టోల్ ఫ్రీ నెంబర్ కూడా ప్రవేశపెట్టిందన్నారు. పరిపాలన పరంగా ముడిపడి ఉన్న అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే రైతులకు ఎటువంటి నష్టం కలుగకుండా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తేజ్‌భరత్ చెప్పారు. అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునే విషయంలో స్పష్టమైన వైఖరితో ఉన్నామన్నారు.

సమాచారం అప్‌లోడ్ చేయాలి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి సంబంధించి క్రమశిక్షణ చర్యల పూర్తి సమాచారాన్ని జిల్లా, డివిజన్, మండల పరిధిలోని డ్రాయింగ్ అధికారులు సీఎఫ్‌ఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈనెల 11లోగా అప్‌లోడ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. జిల్లా ట్రెజరీ అధికారి రాష్ట్ర ఖజానా శాఖ విడుదల చేసిన ఉత్తర్వులపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ సంబంధిత డీడీవోల ద్వారా చేపట్టాల్సిన ప్రక్రియపై డాక్యుమెంట్ రూపొందించి సమాచారం అందజేయాలన్నారు. డీటీఓ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో వివరాల నమోదు అనంతరం జిల్లాస్థాయి సమగ్ర నివేదికను క్రోడీకరించి ఈనెల 15వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.


పోలీసు స్పందనకు 26 ఫిర్యాదులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 26 ఫిర్యాదులను ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి స్వీకరించారు.

2 నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్ఎస్‌సీ, ఒకేషనల్, ఓఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకూ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం ప్రకటనలో తెలిపారు. 2న తెలుగు, కాంపోజిట్ కోర్సు పేపర్-1, 3న హిందీ, 5న ఇంగ్లిష్, 6న మ్యాథమెటిక్స్, 7న సైన్స్, 8న సోషల్ స్టడీస్, 9న కాంపోజిట్ కోర్సు పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), 10న ఓఎస్ఎస్‌సీ మెయిన్‌లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం,అరబిక్, పర్షియన్) పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త విష్ణురావు కన్నుమూత



నిడదవోలు రూరల్: నిడదవోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త యిమ్మణి విష్ణురావు (76) సోమవారం రాత్రి విశాఖపట్టణంలోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన కాంగ్రెస్, బీజేపీలలో పలు కీలక పదవులు నిర్వర్తించారు. నిడదవోలు, విశాఖపట్టణంలో రామకృష్ణ ఇంజినీరింగ్ కంపెనీ, సినిమా థియేటర్లు నెలకొల్పారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు విష్ణురావు స్వయాన వియ్యంకుడు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విష్ణురావు మృతికి పట్టణ రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

అన్నదాతలకు సర్వేశ్వర్యం



పంట పొలాల్లో సర్వే నిర్వహిస్తోన్న డ్రోన్

- వందేళ్ల తరువాత భూ సమగ్ర సర్వే ప్రక్రియ
- తొలి విడతలో డ్రోన్ల సాయంతో చురుగ్గా పూర్తి
- మిగిలిన ప్రాంతాల్లోనూ వడివడిగా పనులు
- యజమానులకు హక్కుల పత్రాల పంపిణీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గణాంకాలు..

మొత్తం గ్రామాలు	: 1,046
బేస్‌స్టేషన్‌లు	: 10
డ్రోన్‌లు	: 19
రోవర్లు	: 171
డ్రోన్‌లపై సర్వే	: 906
తొలి విడత సర్వే పూర్తయిన గ్రామాలు	: 230
సర్వే బృందాలు	: 575
అవసరమైన సర్వే రాళ్లు	: 3,46,929
యజమానులకు అందజేసిన రాళ్లు	: 86,946
పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలు	: 1,11,037

సాక్షిప్రతినిధి, కాకినాడ: వందేళ్ల తరువాత తొలిసారిగా సమగ్ర భూసర్వే చేపట్టి రాష్ట్ర ప్రభుత్వం కొత్త అధ్యాయానికి నాంది పలికింది. యజమానులకు భూమిపై శాశ్వత హక్కు కల్పిస్తూ పత్రాలను చేతుల్లో పెడుతోంది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాలకు ఈ పత్రంతో పరిష్కారం దొరికింది. ఎవరి భూమి ఎంత ఉంది, అసలు అది ఎక్కడ ఉంది, ఆక్రమణలకు గురైందా..లాంటి ఆందోళనలతో ఉన్న రైతులకు ఊరట లభిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో సమగ్ర సర్వేను మూడు విడతల్లో చేపడుతున్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇందుకు వినియోగిస్తున్నారు. తూర్పుగోదావరి..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ.. కాకినాడ జిల్లాలలో ఇందుకు సంబంధించిన పనులు చురుగ్గా చేపడుతున్నారు. డ్రోన్ల సాయంతో సరిహద్దులను నిర్ణయించి రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ల ఇమేజ్‌లను సేకరించి సర్వే ఆఫ్ ఇండియాకు పంపుతున్నారు. అక్కడి నుంచి వచ్చిన ఓఆర్‌ఐ మ్యాప్‌ల ఆధారంగా సర్వే చేస్తున్నారు.

హద్దులు తెలుపుతూ రాళ్ల ఏర్పాటు

గ్రామాల సరిహద్దు నుంచి ఇల్లు, ఖాళీ స్థలాల వరకు ప్రతి అంగుళం విడిచిపెట్టకుండా సర్వే చేపట్టడం విశేషం. ఎన్నో వివాదాలకు చెక్ పెట్టే ఈ సర్వే భావి తరాలకు బంగారమేనని భావించాలి. కొందరు తప్పిదాలతో తలెత్తిన సమస్యలను సర్వేతో చక్కదిద్దుతున్నారు. అంతేకాదు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్వే పూర్తయ్యాక సరిహద్దులు తెలిసేలా రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతలో మూడు జిల్లాలు కాస్త అటు, ఇటుగా సర్వే లక్ష్యాలను అధిగమించిన జాబితాలో సగర్వంగా చేరాయి. రెండు, మూడు విడతల లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికారులు చురుగ్గా అడుగులు వేస్తున్నారు.



అలమూరులో భూ హక్కు పత్రాన్ని అందచేస్తోన్న అధికారులు

పల్లెల్లో ప్రశాంతత

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం భూపాలపట్నంలో పైలట్ ప్రాజెక్టుగా సమగ్ర భూ సర్వేను అప్పటి రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రారంభించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నవకండ్రవాడ, కోనసీమ జిల్లా పాలగుమ్మిలో ఈ సర్వేకు శ్రీకారం చుట్టారు. ఏడాదిన్నరగా సర్వే ప్రక్రియను వేగవంతంగా చేపడుతూ రైతులకు ఎంతో మేలు చేస్తోంది. మునుపెన్నడూ ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టలేదంటే అతిశయోక్తి కాదు. పల్లెల్లో కక్షలు, కార్పణ్యాలు, కొట్లాటలు అన్నీ భూవివాదాల కారణంగానే తలెత్తేవి. వాటన్నింటికీ ఈ సర్వే పరిష్కారం చూపెడుతోంది. ప్రశాంత వాతావరణానికి దారి చూపుతోంది.



అంబాజీపేట పసుపల్లిలో సర్వే రాళ్లను పాతుతున్న దృశ్యం

కాకినాడ జిల్లా పిఠాపురం,కోటనందూరు, ప్రత్తిపాడు మండలాల్లో సర్వే ప్రారంభించారు. 413 గ్రామాల్లో 434 మంది సర్వేయర్లు 217 బృందాలుగా ఏర్పడి సర్వే ఈ ప్రక్రియ చేపట్టాయి. మొదటి దశలో 121 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. రెండో విడత కూడా 86 గ్రామాల్లో వచ్చే నెల 30 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. తొలి విడతలో సర్వే పూర్తయిన 121 గ్రామాల్లో 186 123 సర్వే రాళ్లు అవసరం. 39,460 మందికి చెందిన భూముల్లో 1,25,164 సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. సర్వేపూర్తి చేసి వదిలేయకుండా వెంటనే యజమానులకు శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తున్నారు.

కోనసీమ జిల్లాలో అమలాపురం మండలం పాలగుమ్మిలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన దగ్గర నుంచి సర్వే పనులు వేగంగా చేపట్టారు. ప్రస్తుతం మల్కిపురం మండలంలో సర్వే జరుగుతోంది. జిల్లాలో 315 గ్రామాలుంటే 298 చోట్ల డ్రోన్ల సాయంతో సర్వే చేశారు. తొలివిడతలో 137 గ్రామాలలో సర్వే పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇప్పటికే 65 గ్రామాల్లో పూర్తి చేశారు. ఇందులో 122 551 సర్వే రాళ్లు అవసరమని గుర్తించారు. 28,139మంది యజమానులకు చెందిన భూముల్లో 88,324 సర్వే రాళ్లు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలివిడత 272 గ్రామాలకు గాను 44 గ్రామాల్లో భూ సర్వే పూర్తయ్యింది. ఇక్కడ 72,485 సర్వే రాళ్లు అవసరం. ఇంతవరకు 58,043 సర్వే రాళ్లు వచ్చాయి. వీటిలో 19,347 సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు.

ప్రతి భూమినీ సర్వే చేస్తున్నాం



ప్రతి గ్రామంలో ప్రతి సర్వే నంబర్‌లో ఏ ఒక్క భూమి వదలకుండా సర్వే చేస్తున్నాం. ప్రభుత్వ భూములతో పాటు పోరంబోకు, ప్రైవేటు భూములనే తేడా లేకుండా సర్వే జరుగుతోంది. ఎన్నో ఏళ్లుగా చాలా గ్రామాల్లో భూ వివాదాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేతో ఈ వివాదాల పరిష్కారానికి మార్గం లభించింది. దీనిద్వారా అందరికీ న్యాయం జరుగుతుంది. రెండు, మూడు విడతలు కూడా చురుగ్గా జరుగుతోంది.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ

సంతోషంగా ఉంది



నాకు రెండెకరాల 40 సెంట్లు భూమి ఉంది. సమగ్ర భూ సర్వే బాగా జరిగింది. గతంలో ఏ ప్రభుత్వం ఈ రకంగా భూములను సర్వే చేసిన సాహసం చేయలేకపోయింది. ఇంత కాలానికి సర్వే చేయడం ద్వారా భూమిపై పూర్తి హక్కులు కల్పించడం సంతోషంగా ఉంది. భూ సరిహద్దు వివాదాలకు భవిష్యత్‌లో అసలు ఆస్కారమే ఉండదు.

– మట్టా రామకృష్ణ, చింతలూరు, ఆలమూరు మండలం.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

గ్రంథాలయాల్లో జూన్ 12 వరకూ నిర్వహణ

కొవ్వూరు: వేసవి సెలవుల్లో పిల్లలకు విజ్ఞానం, విలువలతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు గ్రంథాలయ శాఖ సిద్ధమైంది. మంగళవారం నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరాలను జూన్ 12 వరకూ నడపనుంది. 10 నుంచి 15 ఏళ్ల లోపు చిన్నారులకు ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించింది. విద్యార్థులను గ్రంథాలయాలకు రప్పించి రోజూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనుంది. నీతి, పంచతంత్ర కథలు, దేశనాయకుల జీవిత చరిత్రలు, మరెన్నో ఆసక్తికరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచింది. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిబిరాలను నిర్వహించనుంది. వీటి నిర్వహణకు అన్ని వర్గాల సహకారం తీసుకోవాలని సంకల్పించింది. రిటైర్డు ఉద్యోగులు, రిటైర్డు ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్‌లుగా నియమించి శిక్షణ ఇవ్వనుంది. శిబిరాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. పూర్వపు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు 154 చోట్ల శిబిరాలు నిర్వహిస్తారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యదర్శి ఎం శేఖర్‌బాబు చెప్పారు. ఆసక్తి ఉంటే నాలుగు,ఐదు తరగతుల విద్యార్థులు హాజరు కావచ్చునన్నారు. వేసవి సెలవు వృథా కాకుండా ఆటపాటలతో కూడిన విజ్ఞానాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అనుభవం కలవారిని రిసోర్సు పర్సన్లుగా నియమించి విద్యార్థులు తర్ఫీదు ఇస్తామన్నారు. వారానికి ఒకసారి చర్చ, సమీక్ష నిర్వహిస్తామని వివరించారు.



కొవ్వూరు శాఖా గ్రంథాలయంలో శిబిరానికి హాజరైన చిన్నారులు

ఆన్‌లైన్ ఆదాయం అదుర్స్

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ఆన్‌లైన్ ద్వారా భారీగా ఆదాయం వస్తోంది. గత 20 రోజుల్లోనే దేవస్థానానికి వ్రతాలు, రూమ్స్ రిజర్వేషన్, ఇతర సేవలకు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు ద్వారా రూ.18,66,507 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. రత్నగిరి దేవస్థానంలో ఏప్రిల్ 17 నుంచి అన్ని రకాల సేవలకు ఆన్‌లైన్ సర్వీస్ ప్రారంభించారు. స్వామివారి దర్శనం, వ్రతాల టిక్కెట్లు, కల్యాణం, గదుల రిజర్వేషన్, ప్రసాదం అన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఆన్‌లైన్ సర్వీసుల కోసం www.aptemper.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందవచ్చని చెప్పారు. అన్నవరం దేవస్థానానికి ఆన్‌లైన్ సేవల ద్వారా గత నెల 17 నుంచి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు రూ.18,66,507 ఆదాయం సమకూరింది. ఈ విధానం ద్వారా ఎక్కువగా సత్రాల్లో గదులు రిజర్వు చేసుకున్నారు. 1,859 గదులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోగా రూ.11,08,818 ఆదాయం వచ్చింది. వ్రతాలు, కల్యాణాల టిక్కెట్లు 444 మంది ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయగా రూ.5,87,314 ఆదాయం వచ్చింది. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.18,500 వచ్చింది. విరాళాలు రూ.1,51,875 వచ్చాయి.

జిల్లా రెడ్‌క్రాస్‌కు గవర్నర్ పురస్కారం



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లా రెడ్ క్రాస్ శాఖ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్ష హోదాలో కలెక్టర్ మాధవీలత పురస్కారం అందుకున్నారు. సోమవారం విజయవాడ రాజ్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డ్ ప్రదానం జరిగింది. రెడ్ క్రాస్ చెట్టును నాటండి- ఇంటిని రక్షించండి అనే థీమ్‌తో మొక్కల పెంపకంతో పాటు రక్తదాన ప్రచారం వంటి కార్యక్రమాలు మూడేళ్లుగా సేవలందిస్తోందని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.40 లక్షల మేర విరాళాలు సేకరించగలిగామన్నారు. జిల్లా శాఖ చేసిన సేవలను వివరించారు.

అష్టాదశ మామిడులు!



బూరుగుపూడిలో ఎనిమిది రకాల కాయలు కాస్తున్న మామిడి చెట్టు

బుర్రకో బుద్ధి.. జిహ్వకో రుచి అంటారు. కానీ ఆ చెట్టును చూస్తే కొమ్మకో కాయ.. కాయకో రుచి అనాలేమో! కోరుకొండ మండలం బూరుగుపూడి పోశాలమ్మ గుడి వీధిలో ఎనిమిది రకాల మామిడి కాయలతో ఒక చెట్టు విరగా కాసింది. లంక ప్రాంతాల్లో మాత్రమే కాయలు కాసే ఈ తరహా చెట్టు, మెట్ట ప్రాంతంలో ఉండటంతో స్థానికులు ఆశ్చర్యంగా పరిశీలిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం కడియం నర్సరీ నుంచి ఈమొక్కను తెచ్చానని, చెట్టుగా ఎదిగిన తర్వాత కాపు విరివిగా కాస్తున్నట్టు దీని యజమాని భమిడిపల్లి భాస్కరశాస్త్రి చెప్పారు. ఈ చెట్టుకు పండూరి మామిడి, సువర్ణరేఖ, నీలాలు, కొత్తపల్లి కొబ్బరి, రసాలు, బొండం, పంచదార కలశ, గోవ వంటి ఎనిమిది రకాల కాయలు కాయగా ఒక్కోటి ఒక్కో రుచితో ఉంది.

– మధురపూడి

పక్కాగా స్వయం లెక్క..

- ఇకపై 'లోకోస్' ద్వారా సంఘాల కార్యకలాపాలు
- అక్రమాలకు చెక్ పెట్టే దిశగా కొత్త విధానం
- జిల్లాలో 30,831 స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపయోగం

సాక్షి, రాజమహేంద్రవరం: స్వయం సహాయక సంఘాల్లో పారదర్శకతకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) శ్రీకారం చుట్టింది. అక్రమాలు అరికట్టడంపై దృష్టి సారించేందుకు 'లోకోస్' అనే యాప్‌ను తీసుకొస్తోంది. సంఘాల సమస్త సమాచారం ఇందులో పొందుపరిచేందుకు చర్యలు ప్రారంభించింది. సంఘాల కార్యకలాపాలు ప్రస్తుతం వెలుగు విభాగం ద్వారా నిర్వహిస్తున్నారు. అక్కడక్కడ అక్రమాలు జరుగుతున్నాయి. రుణాలను వెలుగు సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పొదుపు సొమ్ము సైతం ఆరగిస్తున్నారన్న విమర్శలున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి వాటికి స్వస్తి చెప్పి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఉండేందుకు యాప్ తీసుకొచ్చారు. ప్రస్తుతం లోకోస్ యాప్‌లో నమోదు ప్రక్రియ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఏ, సీబీఓ ఆడిటర్లు, డీపీఎంలకు శిక్షణ ఇచ్చారు. వీరు పొదుపు సంఘాలకు మండలాల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి, యాప్‌లో వివరాలు నమోదు చేయిస్తారు.

ఒకే యాప్

మహిళా సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు ఇతర వివరాల నమోదుకు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. ఇకపై ఈ సమస్యకు చెక్ పడనుంది.మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తోంది. రుణాల మంజూరు పారదర్శకంగా ఉండేందుకు యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. 17 మండలాల పరిధిలో 30,831 మహిళా సంఘాలుండగా.. 3,08,910 సభ్యులున్నారు. వీరు అర్హతను బట్టి రుణాలు తీసుకుంటున్నారు. వీటికి ప్రస్తుతం ఒక్కో రకమైన రుణానికి(స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ తదితర) ఒక్కో యాప్ ఉంటోంది. ఒక్కో మహిళలకు సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ, పొదుపు, రుణాల సమగ్ర సమాచారం ఇకపై 'లోకోస్' యాప్‌లో లభించనుంది. పొదుపు సంఘం పర్యవేక్షణకు ఒక్కో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీఓ) చూస్తారు. వీరు కూడా పొదుపు సంఘాల సభ్యులే కావడంతో పారదర్శకత లోపిస్తోందని భావించి పక్కా వివరాలు తెలియజేసేలా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా 100 మంది వీఏఓలకు యాప్ నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు. ప్రతి సభ్యురాలి సమాచారం ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. శిక్షణను ఐబీసీబీ డీపీఎం జనార్దనరావు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో పొదుపు సంఘాలు, సభ్యుల వివరాలు ఇలా..

మండలం	స్వయం సహాయక సంఘాలు	సభ్యులు
అనపర్తి	1,612	16,120
బిక్కవోలు	1,856	18,560
చాగల్లు	1,493	14,930
దేవరపల్లి	1,972	19,720
గోకవరం	1,882	18,820
గోపాలపురం	1,601	16,010
కడియం	2,157	21,570
కోరుకొండ	1,985	19,850
కొవ్వూరు	1,723	17,230
నల్లజర్ల	2,033	20,330
నిడదవోలు	1,723	17,230
పెరవలి	1,850	18,500
రాజానగరం	2,645	26,450
రంగంపేట	1,499	14,990
సీతానగరం	1,889	18,860
తాళ్లపూడి	1,331	13,310
ఉండ్రాజవరం	1,583	15,830



యాప్‌పై శిక్షణ ఇస్తున్న పీడీ సుభాషిణి, డీపీఎం జనార్దనరావు

15 వరకూ శిక్షణ



లోకోస్ యాప్‌పై వీఓఏలకు ఈనెల 15వ తేదీ వరకూ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. వారు యాప్‌లో సభ్యుల వివరాలు నమోదు చేస్తారు. యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం యాప్‌లో లభిస్తుంది. ఎలాంటి అవకతవకలకు తావుండదు.

– ఎస్.సుభాషిణి, డీఆర్‌డీఏ పీడీ

బ్లాక్ మెయిలింగ్ కేసులో
నలుగురి అరెస్ట్

గోపాలపురం: రైతును బెదిరించి అతని వద్ద నుంచి రూ.లక్ష తీసుకుని మళ్లీ అతనిని మరింత నగదు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేసిన నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కొరివి రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన ఒక రైతు గత నెల 24న పొలం పనులు ముగించుకుని వస్తుండగా అతనిని అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే చంపుతామని బెదిరించడంతో రైతు రూ.లక్ష ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే అమాయక రైతు కావడంతో మరింత నగదు కావాలంటూ వేధింపులకు దిగారు. ఇవ్వకపోతే చంపుతామని బెదిరించడంతో ఆ రైతు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ఆదేశాల ప్రకారం ఇన్‌చార్జి సీఐ కె.లక్ష్మణరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ వీరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కోయ ఉష్ణ చంద్రశేఖర్, నడవపల్లి సతీష్, కొరపాటి మణికుమార్, ఆకుల వెంకట విఘ్నేష్‌లపై కేసు నమోదు చేసి వీరి వద్ద నుంచి రూ.75 వేల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అభయ తారకం

- వర్రీ తగ్గిస్తున్న మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలు
- ఇటు తెలుగు..అటు ఇంగ్లిష్‌లో ముద్రణ
- ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయుక్తం
- దశల వారీగా 1–9 తరగతులకు


పాఠశాల విద్యార్థులు

రాయవరం: విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు ప్రవేశ పెట్టింది. తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పడుతుండడం సహజం. అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌సీఈఆర్‌టీ చర్యలు చేపట్టింది. సర్కారు బడుల్లో అంచలంచెలుగా అమలు చేసిన మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలు సత్ఫలితాలిచ్చాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. రెండు మాధ్యమాల్లో పాఠ్యాంశాలు ఉండడం వలన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభ్యసన, బోధన సులభంగా మారింది. మిర్రర్ ఇమేజ్‌లో భాగంగా ఒక పేజీలో తెలుగు, మరో పేజీలో ఇంగ్లిష్‌లో పాఠ్యాంశాలుండేలా చర్యలు చేపట్టడంతో విద్యార్థులు చదువులో బాగా రాణిస్తున్నారు.

9వ తరగతి వరకు పూర్తి స్థాయిలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిర్రర్ ఇమేజ్ విధానాన్ని పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెట్టారు. 2020 సంవత్సరం నుంచి మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను అమల్లోకి తీసుకుని వచ్చి, అంచలంచెలుగా అన్ని తరగతులకు అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను అమలు చేస్తుండగా, వచ్చే ఏడాది 10వ తరగతికి కూడా అమలు చేయనున్నారు. తెలుగు మీడియంలో చదివే విద్యార్థులు ఉన్నత విద్యకు వచ్చే సరికి ఇంగ్లిష్ చదువులు లేక ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని తీసుకొచ్చిన మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

సులువుగా బోధనాభ్యసనం

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఒకటి నుంచి పది, ఇంటర్మీడియెట్ వరకు తెలుగు మీడియంలో చదువుతుంటారు. ఆ తర్వాత డిగ్రీ పూర్తిగా ఇంగ్లిషు మీడియంలో చదవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి. ఇంగ్లిషు భాషలో ఉండే పాఠ్యాంశాలను చదవలేక డిగ్రీ చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నారు. అటువంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి మిర్రర్ ఇమేజ్ పాఠ్య పుస్తకాలను ప్రవేశ పెట్టింది. చిన్నతనం నుంచే తెలుగు మీడియం చదివే విద్యార్థులు సులువుగా ఇంగ్లిషును అర్థం చేసుకునేలా పాఠ్య పుస్తకాలను ముద్రించింది. ఈ విధానం విద్యార్థుల భవిష్యత్తుకు చాలా ఉపయోగపడుతున్నట్లు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,879 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఈ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తోంది.



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు

విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తున్న మిర్రర్ ఇమేజ్ పుస్తకాలకు ఆదరణ పెరిగింది. దశలవారీగా అన్ని తరగతులకు ప్రవేశ పెట్టారు.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.



చక్కగా అర్థం చేసుకుంటున్నారు

మిర్రర్ ఇమేజ్ పుస్తకాలతో విద్యార్థులు పాఠ్యాంశాలను చక్కగా అర్థం చేసుకుంటున్నారు. ఇవి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయనడంలో సందేహం లేదు. ఈ పుస్తకాలతో అటు ఉపాధ్యాయులకు బోధన, ఇటు విద్యార్థులకు అభ్యసన సులువుగా ఉంటుంది.

– లంక రాణి, జీహెచ్ఎం, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం



మిర్రర్ ఇమేజ్ పుస్తకాలు

పెయ్యి దూడపై అడవి జంతువుల దాడి

- మరో లేగదూడ, గేదెపైన దాడి
- దాడి చేసిన జంతువును గుర్తించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు


అడవి జంతువు సంచరించిన ప్రదేశంలో పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

గండేపల్లి: పట్ట పగలే పెయ్యి దూడపై గుర్తు తెలియని అడవి జంతువు దాడిచేసి చర్మాన్ని వలిచి మాంసాన్ని భక్షించడంతో ఆ లేగదూడ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. రెండు రోజుల క్రితం మల్లేపల్లి శివారులో పొలంలో ఉన్న లేగదూడపై దాడిచేసి హతమార్చిన ఘటన మరువకముందే మరోచోట దాడి సంఘటన జరగడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఉప్పలపాడు శివారులో సీతారాంపురం వెళ్లే మార్గంలో మల్లేపల్లికి చెందిన కొత్త శివ పామాయిల్ తోటలో అంకం ఆదినారాయణ తన పశువులను కట్టేసి ఉంచాడు. రోజులానే సోమవారం ఉదయాన్నే పొలంలోకి వెళ్లి పాలు తీసుకుని ఇంటికి వచ్చేశాడు. సుమారు 8 నుంచి 9 గంటల ప్రాంతంలో పొలంలోకి వెళ్లే సరికి లేగదూడను గుర్తు తెలియని అడవి జంతువు తీవ్రంగా గాయపరిచి మరో లేగదూడ, గేదెను స్వల్పంగా గాయపరిచింది. బాధితులు విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలియజేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా అటవీశాఖాధికారి ఐకేవీ రాజు గాయపడిన పశువులను, అడవి జంతువులు సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించి పాదముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు తమ పశువులను పొలాలలో ఉంచవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న ఉప్పలపాడు, సీతారాంపురం, రాజుపూడి, తదితర గ్రామాలలో ప్రజలకు విషయాన్ని తెలియజేసి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఘటనా స్థలంలోను, తిరుపతి చెరువు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈయన వెంట వన్యప్రాణి సంరక్షణ సిబ్బంది వరప్రసాద్, ఆర్వో టి.సత్యనారాయణ, ఎస్‌ఓ సిద్దార్థ్, బీటీలు నూకా సాహెబ్, వీఎస్ఎస్ నారాయణ, సంధ్యారాణి, రెడ్డి ఉన్నారు.

ఆదిత్య విద్యాసంస్థలకు
రెడ్‌క్రాస్ పురస్కారం


సుగుణారెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సేవలకు గుర్తింపుగా ఆదిత్య విద్యాసంస్థలను రెడ్‌క్రాస్ పురస్కారం వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డికి అందజేశారు. టర్కీ, సిరియాలలో సంభవించిన భూ కంప సమయంలో ఆదిత్య విద్యాసంస్థలు సమకూర్చిన రూ.48 లక్షల విరాళం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అప్పట్లో అందజేశారు. అత్యధికంగా 2,200 మంది రక్తదానం చేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 13మందికి పురస్కారాలు అందజేయగా కాకినాడ నుంచి ఆదిత్యకు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుగుణారెడ్డిను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

మూడు టన్నుల చేపలు మృతి

- ఆర్‌బీపట్నం రాఘవమ్మ చెరువులో అనుమానాస్పద ఘటన
- మత్స్యశాఖ మంత్రి సిదిరి దృష్టికి తీసుకువెళ్లిన హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు


మృతిచెందిన చేపలను పరిశీలిస్తున్న స్థానికులు


అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు

పెద్దాపురం: సుమారు 174 ఎకరాల విస్తీర్ణం కలిగిన చేపల చెరువులో మూడు టన్నుల వరకు చేపలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చెరువు నీటిని, మృతి చెందిన చేపలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే గ్రామానికి చెందిన రాఘవమ్మ చెరువులో 174 ఎకరాల మేర చేపల సాగును మత్స్యకార సంఘం చేసుకుంటోంది. యథావిధిగా చేపలను పట్టేందుకు సిద్ధమవుతున్న మత్స్యకారులు సొసైటీకి సుమారు 50 టన్నుల చేపలు పట్టాల్సి ఉండగా ఉదయాన్నే చెరువు గట్టుకు వచ్చేసరికి మూడు టన్నుల చేపల అనుమానాస్పద స్థితిలో మృతి చెంది చెరువు గట్టుకు చేరాయి. మత్స్య శాఖాధికారుల అంచనా ప్రకారం వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుంది. విషయం తెలుసుకున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఘటనా స్థలానికి చేరుకుని చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చేపల మృతి కారణాలపై విచారణ జరిపాలని, భారీగా నష్టపోయిన లీజుల దారులకు న్యాయం చేయాలని హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వారికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. విష ప్రయోగమా? వడదెబ్బ కారణంగా ఏర్పడ్డ ఆక్సిజన్ లోపమా? అనే దానిపై విచారణ జరుపుతున్నామని మత్స్యశాఖాధికారి కె.ప్రకాశరావు తెలిపారు.

తలసేమియా చిన్నారుల ప్రాణాలు కాపాడాలి


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


రక్తదానం చేస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నగరంలో మెగా రక్తదాన శిబిరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను రక్తదానం చేసి కాపాడాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా సోమవారం జాంపేట ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం మండపంలో జైన్ సేవాసమితి, మాగ్నా మదర్‌అండ్ చైల్డ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రక్తదానం చేసి, యువతలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రక్తదానంపై అపోహలు, భయం విడనాడి, మానవత్వంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు అవసరమైన బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌కు 50 శాతం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. జైన్ సేవాసమితి అధ్యక్షుడు విక్రమ్ జైన్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఎనిమిది మంది చిన్నారులకు బెంగళూరు మహావీర్ జైన్ హాస్పిటల్లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్ త్వరలో జరుగుతుందన్నారు. రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌కు వెళుతున్న చిన్నారులకు అతిథులు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ శిబిరంలో తలసేమియా అండ్ సికిల్ సెల్ అనేమియా పిల్లలకు డీఎస్ఏ మ్యూటేషన్ నిర్ధారణ పరీక్ష, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, చాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, నగర ప్రముఖులు అశోక్ కుమార్ జైన్, బెరులాల్ జైన్, అనూప్ జైన్, ముప్పన శ్రీను, రాజ్ కటారియా, అశ్విన్ జైన్, బిజేష్ వైష్ణవ్, అమీర్ పాషా, భరత్ రాఘవ్ పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించేది లేదు

చంద్రబాబుకు రాష్ట్ర హోం మంత్రి వనిత హెచ్చరిక


తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

కొవ్వూరు: రైతుల సమస్యల్ని ఏనాడూ పట్టించుకోని ప్రతిపక్ష నేత చంద్రబాబుకు.. వారి గురించి మాట్లాడే నైతిక హక్కులేదని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత హెచ్చరించారు. 14 ఏళ్ల పాలనలో ఏనాడైనా పంట సీజన్ ముగిసే సమయానికి రైతులకు నష్ట పరిహారం చెల్లించారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాలేనన్న ఫ్రస్టేషన్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సోమవారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముసలి సైకో ఎవరో...పిల్ల సైకో ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. అకాల వర్షాలను ఆసరాగా తీసుకుని రైతుల వద్దకు వెళ్లి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న చంద్రబాబును, లోకేష్‌ను చూసి జనం ఛీకొడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో ఏడాదిలో రైతులకు చెల్లించాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రెండేళ్లయినా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు సిగ్గులేకుండా తన పాలనలో వారంలోనే ఇచ్చానని చెబుతున్నారన్నారు. రూ.2,500 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టిన చంద్రబాబు పాలనను రైతులు ఎప్పటికీ మరిచిపోరన్నారు. విత్తన రాయితీ, ధాన్యం కొనుగోలు సొమ్ము, ఇన్‌పుట్ సబ్సిడీతో కలిపి రూ.5,900 కోట్ల మేర రైతులకు ఎగనామం పెట్టిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఆయన ఎన్ని డ్రామాలాడినా రైతులు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రైతులను ఆదుకోవడంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిలను మించిన వారెవరూ లేరన్నారు. కరోనా విపత్తు సమయంలో రైతులు, ప్రజా సమస్యలు విస్మరించి హైదరాబాద్‌లోని ఇంద్ర భవనంలో చంద్రబాబు, లోకేష్‌లు పడుకున్నారని విమర్శించారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పునరుద్ఘాటించారు.

పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన

సామర్లకోట: పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామ పరిపాలనపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని ఆయా జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, విస్తరణ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు జూన్ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అయ్యే శిక్షణలో భాగంగా వారికి శిక్షణ ఇవ్వడానికి ఆయా జిల్లాల్లో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలను మాస్టర్ ట్రైనీలుగా ఎంపిక చేశామన్నారు. ఈ దఫా 40 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి మాస్టర్ ట్రైనీలు హాజరు అయ్యారు. ఫీల్డు స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలో వారికి వివరిస్తామన్నారు. పంచాయతీ సమావేశాలు, గ్రామసభ కార్యాచరణ కమిటీల ఏర్పాటుపై శిక్షణ ఇచ్చారు.

మొదటి రోజు శిక్షణలో ఈటీసీ ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్‌రెడ్డి, కేవీఎస్ఆర్ నిహారిక, బి.ఆంజనేయులు, వి.వెంటేశ్వర్లు, వి ప్రసాద్ శిక్షణ నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

అనపర్తి: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని మహేంద్రవాడలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఏపీఓ నల్లమిల్లి సూర్యభాస్కరరెడ్డి తెలిపిన వివరాల ఇలా వున్నాయి. గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో గల బోదె కాలువ పూడికతీత పనులను ఉపాధి కూలీలు చేపడుతున్నారు. సోమవారం పూడికతీత పనులకు హాజరైన గ్రామానికి చెందిన వెలగల సీతారత్నం(77) గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ మల్లిడి గంగారాజు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తమ సంతాపాన్ని ప్రకటించారు.

ఉరి వేసుకుని వాచ్‌మన్ ఆత్మహత్య

కాకినాడ రూరల్: కాకినాడ ఎస్.అచ్యుతాపురానికి చెందిన భూపతి బాలప్రసాద్(38) ఇంట్లో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం రామారావుపేటలో ఒక ప్రైవేటు బ్యాంక్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న బాలప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యకు అనారోగ్యం కారణంగా మనస్థాపానికి గురైన బాలప్రసాద్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న పెద్దకుమారుడు అనిల్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.